అభినందనలు

ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో కంటోన్మెంట్ బాలంరాయికి చెందిన విజయ్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ గణేష్, సాయి కుమార్‌ను శుక్రవారం అభినందించారు.
– కంటోన్మెంట్, మే 24

తరలింపులో ఆభరణాలు స్వాధీనం

మారేడ్‌పల్లి, మే 24: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎలాంటి పత్రాలు లేకుండా బంగారు ఆభరణాలను తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం రైల్వే పోలీసులు అదుపులోకి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే సీఐ సాయి ఈశ్వర్ గౌడ్ తెలిపిన ప్రకారం, చార్మినార్ ప్రాంతానికి చెందిన మనబ్ హుదైత్(34) రైల్లో సుమారు 13 లక్షల 16 వేల విలువైన 108.80 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర పన్ను శాఖ అధికారులకు ఆభరణాలను అప్పగించినట్లుగా సీఐ తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

కాచిగూడ : పాతబస్తీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జ్ఞానభారతి స్కూల్, హనుమాన్‌నగర్ ఉప్పుగూడలోని సాయికృప వాసంత బాంకెట్ హాల్‌కు రావాలని, 99492 38492లో సంప్రదించవచ్చునని తెలిపారు. కిమ్స్, సన్‌షైన్ దవాఖాన వైద్యుల పర్యవేక్షణలో కంటి, బీపీ, షుగర్, 2డీ, ఈసీజీ, బీఎండీ, మోకళ్లు, జనరల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

పెయింటింగ్ పోటీలను ప్రారంభించిన ఎన్టీపీసీ అధికారులు – తాము వేసిన పెయింటింగులను ప్రదర్శించిన విద్యార్థులు

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు

బన్సీలాల్‌పేట్, మే 24: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) సంస్థ ఆధ్వర్యంలో భోలక్‌పూర్‌లోని మేకల మండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. శుక్రవారం పోటీలను ప్రారంభించిన ఎన్‌టీపీసీ సంస్థ డీజీఎం బద్రుద్దీన్ అన్సారీ మాట్లాడుతూ, దక్షిణ ప్రాంతీయ కేంద్ర కార్యాలయం ద్వారా చేపడుతున్న కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత కార్యక్రమాలలో భాగంగా మే 16 నుంచి 31 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులలో పర్యావరణం గురించి, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించేందుకు 'ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను చేపట్టామని అన్నారు. రోజు వారి కొనుగోళ్ళలో ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి, పర్యావరణానికి హాని కలగకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. విజేతలను ఎంపిక చేసి నెలాఖరులో బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ మేనేజర్ ప్రియాంక భూయాన్, పాఠశాల హెచ్ఎం మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు గాజుల అలంకరణ

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి ఇష్టమైన రోజు శుక్రవారం, కాగా అలంకరణ మరింత ప్రత్యేకంగా చేపట్టారు. భక్తులు, దాతలు సమర్పించుకున్న గాజులతో ఆలయ అర్చకులు అమ్మవారి మూల విరాట్‌కు అలంకరణ జరిగింది. గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. – అమీర్‌పేట్, మే 24

అన్నదాన కార్యక్రమంలో పేదలు

వారాసిగూడలో అన్నదానం

సికింద్రాబాద్, మే 24: వారాసిగూడలోని సాయి అమ్ములు ఆసుపత్రి వద్ద దాని యాజమాన్యం శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. సాయి అమ్ములు ఆసుపత్రి నిర్వాహకులు వైద్య సేవలే కాకుండా సమాజ సేవలోనూ ముందుంటారు. ఆ ఆసుపత్రి డాక్టర్ మృణాళినితో పాటు ఆమె భర్త బీఆర్ఎస్ నాయకుడు మహదేవన్ రవి సమాజ సేవకు తన వంతు సేవ చేస్తున్నారు.
పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు వారంలో రెండు రోజులు శుక్ర, శనివారాలు పేదలకు, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేపడుతున్నారు.

31న జాబ్ మేళా

అంబర్‌పేట, మే 24 : ఈ నెల 31న పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (గ్రీన్ ల్యాండ్స్) ఆ ధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, మువ్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారి తెలిపారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు,పేరొందిన సంస్థలు పాల్గొని ఉద్యోగులను నియమించుకోనున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ అర్హత ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18–30 ఏండ్ల వారు అర్హులన్నారు. మేళాలో 25 సంస్థలు పాల్గొని 5 వేల ఉద్యోగాలను భర్తీ చేసుకుంటాయని తెలిపారు.
మేళా రాణిగంజ్ గుజరాతీ హైస్కూల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో సంప్రదించాలని, ఫోన్ నం. 9542433427లలో సంప్రదించాలని తెలిపారు.

ఋగ్వేద సంహిత గ్రంథావిష్కరణ

ముషీరాబాద్,మే 24: సురభారతి సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఋగ్వేద సంహిత సంస్కృత గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఓయా సంస్కృత విభాగం పూర్వఅధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన సురభారతి సమితి ఆవరణలో ఐఎన్‌సీ మాజీ డీజీ డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డాక్టర్ డీవీజీఏ సోమయాజులు, అనంతకృష్ణ, భట్టీశ్వరశర్మ, పీవీఎస్ శర్మ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కాలేజీలో.. పాలిసెట్ పరీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం పాలిసెట్ పరీక్ష నిర్వహించారు. దానిలో భాగంగా సికింద్రాబాద్ పరిధిలోని మారేడ్‌పల్లిలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్ చెక్ చేసి పరీక్షా హాల్‌లోకి పంపిస్తున్నారు.

హల్వా తిని అస్వస్థత.. కేసు నమోదు

ఖైరతాబాద్, మే 24: లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో హల్వా తిని ఓ మహిళ అస్వస్థతకు గురైంది. ఖైరతాబాద్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరిలోని వీనా పాణినగర్‌కు చెందిన కె.స్రవంతి ఈనెల 23న కుటుంబ సభ్యులతో కలిసి లక్డీకాపూల్‌లోని ద్వారకా హోటల్‌కు వచ్చారు. క్యారెట్, మూంగ్‌దాల్ హల్వాను ఆర్డర్ చేశారు. పార్శిల్ చేయించుకొని ఇంటికి తీసుకెళ్లారు. క్యారెట్ హల్వాను స్రవంతి తింటుండగా పాచిన వాసన వచ్చింది. మూంగ్‌దాల్ హల్వా కూడా అదే తీరులో ఉంది. దీంతో హోటల్‌కు వెళ్లి నిలదీయగా నిర్లక్షపు సమాధానమిచ్చారు. అప్పటికే కొంత హల్వాను తిన్న స్రవంతికి వాంతులు మొదలయ్యాయి. దీంతో బాధితురాలు స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

అంబర్‌పేట, మే 24: తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలను నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ వసుధామూరి తెలిపారు. హైటెక్ సిటీ, మాదాపూర్‌లోని శిల్పారామంలో సాయంత్రం ఐదు గంటల నుంచి జరిగే ఈ ఉత్సవాలకు నటుడు, మోటివేషనల్ స్పీకర్ కేవీ ప్రదీప్, యాంకర్ సరస్వతి ప్రదీప్, డాన్సర్, నటి ఆశ్రిత వేముగంటి నండూరి, మ్యూజిక్ డైరెక్టర్ డా.జ్యోశ్యభట్ల అతిథులుగా విచ్చేస్తున్నారని చెప్పారు. ఆలిండియా రేడియో, దూరదర్శన్ కళాకారుడు లక్ష్మణమూర్తి శిక్షణలో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు పాటలు పాడుతుంటే శాలిని అమరనేని, కనక హర్షిణి కూచిపూడి నృత్యరూపకం ఉంటుందని ఈవెంట్ మేనేజర్లు నందిని, యామిని తెలిపారు.

నేడు హైదరాబాద్ జిల్లా నెట్‌బాల్ ఎంపిక పోటీలు

అంబర్‌పేట, మే 24 : నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఎంపిక పోటీలు 25న కాచిగూడలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విఘ్నేశ్వర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సాయంత్రం 5:30 గంటలకు ఆధార్ జిరాక్స్, 4 పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో పాఠశాల వద్దకు రావాలని సూచించారు. వివరాలకు 99120 62240లో సంప్రదించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

అమీర్‌పేట్, మే 24: అమీర్‌పేట్ ఆస్టర్ ప్రైమ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచి వైద్య శిబిరాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీనగర్ పార్కులో వైద్య శిబిరం నిర్వహించారు. పార్కులో వాకింగ్ చేసేందుకు వచ్చిన వారికి ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో దాదాపు 150 మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు, శరీరంలో ఆక్సిజన్ మోతాదు పరీక్ష, బీఎంఐతో పాటు ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్న వారి ఫలితాలను పరిశీలించిన వైద్యులు డాక్టర్ మిసద్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వ్యాయామాలు చేసుకుంటూ వ్యసనాలకు దూరంగా పౌష్టికాహారాలు తీసుకోవడం వల్ల చక్కటి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చన్నారు.

శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యం సులభం

చిక్కడపల్లి,మే 24 : లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే విజయం సులభతరం అవుతుందని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ మట్టా శేఖర్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో బీఏ, బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ బండ్ల శ్రీధర్, అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యా ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. అవసరం మేరకే మొబైల్ వాడకం, చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని కృషి చేయాలని సూచించారు.

ఓపెన్ జిమ్, పాత్‌వే పనులను పూర్తి చేయాలి

కవాడిగూడ, మే 24: పార్క్‌లో నిర్మిస్తున్న ఓపెన్ జిమ్, పాత్‌వే పనులు త్వరగా పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ ఎంసీహెచ్ క్వార్టర్స్ ఈ – సేవ మున్సిపల్ పార్కులో ఓపెన్ జిమ్, పాత్‌వే నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.వెంకటేశ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్ బాబు, ఎ.ప్రభాకర్, రాజుగౌడ్, దిలీప్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నివాళి: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) సూపరింటెండింగ్ ఇంజినీర్ వెంకటరమణ అంత్యక్రియలకు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి శుక్రవారం హాజరై ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. – ఉస్మానియా యూనివర్సిటీ,

సమస్యలు పరిష్కారం చేయాలి

హిమాయత్‌నగర్, మే 24: రాష్ట్రంలో యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యువతకు ఇచ్చిన హామీలను మోదీ నెరవేర్చకుండా పదేండ్లుగా కాలయాపన చేశారని విమర్శించారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగ సమస్య జఠిలమవుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించక పోవడంతో యువత ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ దశలో నిలిచిపోయిన ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు కొత్త ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయాలని అన్నారు. యువజనుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందని తెలిపారు.

అనారోగ్యంతో ఒడిషా బాలుడి మృతి

– ఆర్థిక స్థోమత లేక అంత్యక్రియలు చేయలేని స్థితిలో తల్లిదండ్రులు
– రియల్ వివేక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు

బన్సీలాల్‌పేట్, మే 24: పొట్ట చేత పట్టుకొని నగరానికి వచ్చిన ఒడిషా రాష్ట్ర దంపతులకు విషాదమే మిగిలింది. నగరంలో వారు ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోగా పదకొండేళ్ల కన్న కొడుకును పోగొట్టుకున్నారు. ఒడిషా రాష్ట్రం కలహండి జిల్లా, భాన్‌పూర్ గ్రామం నుంచి బతకడానికి పట్టణానికి వచ్చిన కలియా జహారా, రమా జహారా దంపతులకు కడుపుకోతే మిగిలింది. దుండిగల్ సమీపంలో ఇటుక బట్టీల వద్ద కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న వారి ఒక్కగానొక్క కుమారుడు చింటూ జహారా (11) అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం నల్లకుంటలోని ఫీవర్ దవాఖానలో చేర్పించగా, శుక్రవారం ఉదయం బాలుడు మృతి చెందాడు. ఆ సమయంలో వారి చేతిలో చిల్లి గవ్వలేదు. బాలుడి మృతదేహాన్ని తీసుకెళ్ళాలని దవాఖాన సిబ్బంది బాధిత తల్లిదండ్రులకు చెప్పింది. బాధిత తల్లిదండ్రులు వారి ఆర్థిక పరిస్థితిని వివరించారు. కుమారుడి మృతదేహం వద్ద కూర్చుని రోదిస్తున్న వారి ఆవేదనను చూసిన కొందరు చెప్పడంతో బోయిగూడకు చెందిన రియల్ వివేక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సోషల్ వర్కర్ ఎం.శ్రీనివాస్‌కు ఫోన్ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న శ్రీనివాస్ వారి పరిస్థితిని చూసి చలించిపోయాడు. బాలుడి ఆధార్ కార్డు, దవాఖాన ఇచ్చిన పత్రాలను పరిశీలించిన అనంతరం, కలియా జహారా, రమా జహారా దంపతులను ఓదార్చాడు. తాను బాలుడి అంత్యక్రియలు చేస్తానని వారికి భరోసా ఇచ్చాడు. రియల్ వివేక్ ఫౌండేషన్ అంబులెన్స్‌లో బాలుడి మృతదేహాన్ని తీసుకు వెళ్ళి అల్వాల్‌లోని హిందూ శ్మశాన వాటికలో తన సొంత ఖర్చులతో బాలుడి తల్లిదండ్రుల సమక్షంలో అంత్యక్రియలను పూర్తి చేశారు. నిరుపేదలైన ఆ తల్లిదండ్రుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉన్నదని, ఇలాంటి ఘటనలు ప్రతి నెల 15 నుంచి 20 వరకు తన వద్దకు వస్తున్నాయని, తన సొంత ఖర్చులతో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు.



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, పక్కన సోషల్ వర్కర్ ఎం.శ్రీనివాస్